క్లుప్తంగా

అర్జీలు స్వీకరించిన మంత్రి పార్థసారథి



ఆగిరిపల్లి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంత్రి కొలుసు పార్థసారథి బుధవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి పలు సమస్యలపై 113 అర్జీలను స్వీకరించారు. మంత్రి మాట్లాడుతూ తన వద్దకు వచ్చిన అర్జీలను పరిశీలించి వెంటనే వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని మంత్రి తెలిపారు. తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీఓ ఆనంద్‌బాబు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

నీటి తొట్టెల ఏర్పాటు

ముసునూరు: వేసవిలో పశువుల దాహార్తిని తీర్చేందుకు నీటి తొట్టెలు ఉపకరిస్తాయని వేల్పుచర్ల సర్పంచ్ పుట్ల మోహనరావు అన్నారు. ఉపాధి హామీ పథకంలో మంజూరైన 15 పశువుల నీటి తొట్టెల నిర్మాణాలకు బుధవారం ఏపీఓ రోజ్‌లీల ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహించారు. వేల్పుచర్లలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ మోహన్‌రావు పాల్గొని నీటి తొట్టె నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమాల్లో గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాలు, ఉపాధి హామీ సిబ్బంది, పశు పోషకులు పాల్గొన్నారు.

రఘునందన్‌కు సాహితీ పురస్కారం



తిరువూరు: తిరువూరు రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి రేపాక రఘునందన్‌కు పాల్వంచ కళా పరిషత్ పురస్కారం లభించింది. రెండు తెలుగు రాష్ట్రాల పరిధిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అంశంపై ఉగాది సందర్భంగా నిర్వహించిన కవితల పోటీల్లో రఘునందన్‌కు ప్రోత్సాహక బహుమతి లభించింది. పాల్వంచలో మూడు రోజులపాటు జరిగిన ఉగాది ఉత్సవాల్లో చివరి రోజైన బుధవారం నగదు బహుమతి, జ్ఞాపిక, శాలువాలతో రఘునందన్‌ను సంస్థ నిర్వాహకులు ముంతపురి రాజుగౌడ్, వేముల కొండలరావు, వాసిరెడ్డి రమేష్ సత్కరించారు.

భద్రాచలం నుంచి చనుబండ ఆలయానికి తలంబ్రాల బియ్యం



చాట్రాయి: భద్రాచలం కోదండ రామాలయం నుంచి తలంబ్రాల బియ్యాన్ని మండలంలోని చనుబండ శ్రీ కోదండ రామాలయానికి బుధవారం తీసుకువచ్చారు. ఈ నెల 6న కోదండ రామాలయంలో నిర్వహించే సీతారామ కల్యాణానికి ఈ తలంబ్రాల బియ్యాన్ని వినియోగిస్తారు. ఈ సందర్భంగా తలంబ్రాల బియ్యానికి పూజలు నిర్వహించి స్వామి వార్ల చెంత ఉంచారు. కార్యక్రమంలో ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త పుచ్చకాయల చెన్నకేశవ రెడ్డి, ఆలయ పునర్నిర్మాణ దాతలు వనమా కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

భూముల రీ సర్వేపై ర్యాలీ



చాట్రాయి: ప్రతి రైతూ తమ భూములను రీ సర్వే చేయించుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దార్ గీత అన్నారు. మంకొల్లు గ్రామంలో రీ సర్వేపై బుధవారం నిర్వహించిన ర్యాలీలో ఆమె మాట్లాడుతూ వ్యవసాయానికి సంబంధించిన భూములను రీ సర్వే చేయనున్నామని చెప్పారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ ప్రేమ్‌కుమార్, వీఆర్ఏలు పాల్గొన్నారు.

ఆటిజంపై అవగాహన పెంపొందాలి



ఆగిరిపల్లి: ఆటిజంపై చిన్నారులకు అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంఈఓ ఆనంద్ కుమార్ అన్నారు. ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవం సందర్భంగా స్థానిక భవిత కేంద్రంలో తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆటిజం సమస్యతో బాధపడుతున్న వారు శిక్షణ ద్వారానే ఈ సమస్యను అధిగమించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని విజయదుర్గ, ఫిజియో థెరపిస్ట్ ప్రశాంతి, ఉపాధ్యాయులు ఝాన్సీరాణి, రజిని పాల్గొన్నారు.

రైతుల నిరీక్షణ

- వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం వేలాది రూపాయల చెల్లింపు
- 9 నెలలుగా సరఫరా కాని మెటీరియల్
- కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్న రైతులు



వ్యవసాయ బోరు

నూజివీడు: వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం అన్నదాతలు ఎదురుచూస్తున్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్ల కోసం డీడీల రూపంలో వేలాది రూపాయలు చెల్లించినా తొమ్మిది నెలలుగా నిరీక్షణ తప్పడం లేదు. నియోజకవర్గ వ్యాప్తంగా ఎక్కడా కూడా ఒక్క ట్రాన్స్‌ఫార్మర్‌ను రైతులకు ఏర్పాటు చేయలేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతోంది. వందలాది మంది రైతులు మంజూరైన కనెక్షన్లకు డబ్బులు చెల్లించి ఎదురుచూస్తున్నారు. ఎప్పుడు లైన్లు లాగుతారంటూ విద్యుత్ శాఖ ఏఈ, ఏడీఈ, డీఈ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. గత ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు కృషితో నియోజకవర్గ వ్యాప్తంగా ఒక్క రోజే 540 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను రైతులకు అందజేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు పది నెలలవుతున్నా ఒక్క విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కూడా రైతులకు ఇచ్చిన దాఖలాలు లేవు.

రైతులకు తీవ్ర ఇబ్బందులు

నూజివీడు నియోజకవర్గం మెట్ట ప్రాంతం కావడంతో పంటల సాగుకు వ్యవసాయ బోర్లే ఆధారం. వర్షాకాలం మాత్రమే వర్షాధారంతో పాటు చెరువులు నిండితే చెరువుల్లోని నీటితో పంటలు సాగు చేస్తారు. రబీ సీజన్‌లో మాత్రం తప్పనిసరిగా వ్యవసాయ బోర్లపైనే ఆధారపడి పంటలు సాగు చేస్తారు. మొక్కజొన్న, నాటు పొగాకు, మిర్చి, మినుములు, తదితర పంటలతో పాటు మామిడి, ఆయిల్‌పామ్ తోటలకు బోరు నీరే ఆధారం. అంతటి ప్రాధాన్యత ఉన్న నేపథ్యంలో కూటమి ప్రభుత్వం మాత్రం వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం మెటీరియల్‌ను నెలల తరబడి సరఫరా చేయకుండా కాలం గడుపుతోంది.

నియోజకవర్గంలో మంజూరై పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు

మండలం	పెండింగ్‌లో ఉన్న కనెక్షన్లు
నూజివీడు	154
ఆగిరిపల్లి	212
ముసునూరు	355
చాట్రాయి	236
మొత్తం	957

చేసిన అప్పులకు పెరుగుతున్న వడ్డీలు

రైతుల ప్రయోజనాలకే పెద్దపీట వేస్తోందంటూ కూటమి ప్రభుత్వ పెద్దలు చెబుతున్న మాటలు కోటలు దాటుతున్నాయే గాని, చేతలు మాత్రం గడప దాటడం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులను అడుగుతుంటే మెటీరియల్ రావడం లేదని, ప్రభుత్వం కొనుగోలు చేయాల్సి ఉందంటూ 10 నెలలుగా తమ కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారని వాపోతున్నారు. బోరు వేసేందుకు, విద్యుత్ కనెక్షన్లకు డబ్బులు కట్టేందుకు చేసిన అప్పులకు వడ్డీల భారాన్ని మోస్తున్నామని తమ గోడును వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తమకు మంజూరైన విద్యుత్ కనెక్షన్లకు లైన్లు లాగి, ట్రాన్స్‌ఫార్మర్లు పెట్టి విద్యుత్‌ను సరఫరా చేయాలని కోరుతున్నారు.

ఐదు నెలలుగా ఎదురుచూపులు



మూడు వ్యవసాయ బోర్లు వేయించి ఐదు నెలల కిందట వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం రూ.35,000 చెల్లించా. ఇంతవరకు విద్యుత్ లైన్ వేయలేదు, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయలేదు. విద్యుత్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా స్పందన లేదు. అవసరమైన నీరు ఉన్నా విద్యుత్ కనెక్షన్ లేక ఉపయోగ పడటం లేదు.

–కెత్తే నాని, దిగవల్లి, నూజివీడు మండలం

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

మైలవరం: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేస్తున్నామని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. మైలవరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ప్రజల నుంచి అర్జీలు తీసుకుని వారి సమస్యలు విని సానుకూలంగా స్పందించారు. మొదటి రోజు 105 అర్జీలు వచ్చాయని కార్యాలయ సిబ్బంది తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనల మేరకు ఇక నుంచి ప్రతి బుధవారం ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. మైలవరం నియోజకవర్గంలో రూ.25 కోట్లతో ఎన్ఆర్‌ఈజీఎస్ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. దీనిలో రూ.22 కోట్ల అభివృద్ధి పనులు పూర్తి కాగా రూ.3 కోట్ల పనులు పురోగతిలో ఉన్నాయని చెప్పారు. రెవెన్యూ, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూలకు 547 మంది హాజరు

ముసునూరు: బీసీ, ఈబీసీ, వైశ్య, కమ్మ, కాపు కార్పొరేషన్ రుణాల ఇంటర్వ్యూలకు 547 మంది లబ్ధిదారులు హాజరయ్యారని ఎంపీడీఓ జి.రాణి తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఇంటర్వ్యూలకు 669 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా వారిలో 547 మంది ఇంటర్వ్యూల్లో పాల్గొన్నారని చెప్పారు.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

విస్సన్నపేట: ఏపీ పాలిటెక్నిక్ ఎంట్రన్స్ టెస్ట్‌కు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇస్తామని విస్సన్నపేట వికాస్ పాలిటెక్నిక్ కళాశాల చైర్మన్ ఎన్. నర్సిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు తమ కళాశాలలో నిర్వహించే ఉచిత శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు ప్రిన్సిపాల్ కె. రమేష్, సెల్: 90102 22179 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఎల్బీఆర్సీఈలో వర్క్‌షాపు

మైలవరం: మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం మొదటి సంవత్సరం విద్యార్థులకు సీ ప్లస్‌ప్లస్ ప్రోగ్రామింగ్ అంశంపై రెండు రోజుల వర్క్‌షాపు బుధవారం ప్రారంభమైంది. వర్క్‌షాపును ఎల్‌టీఐ మైండ్ ట్రీ, హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఎం. త్రిభువన్ రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. సీ ప్లస్ ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్ ఉపయోగించి అడ్వాన్స్ కోడింగ్ ఎలా చేయాలి అనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డాక్టర్ డి. వీరయ్య మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు, డీన్ అకాడమిక్స్ డాక్టర్ ఎం. శ్రీనివాసరావు, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగాధిపతి వీరయ్య పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

జిల్లా వ్యవసాయాధికారి విజయకుమారి

జి.కొండూరు: రైతులు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి విజయకుమారి అన్నారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్‌డ్ నేచురల్ ఫార్మింగ్, రైతు సాధికార సంస్థ సంయుక్తంగా ఖరీఫ్‌లో ప్రకృతి వ్యవసాయ యాక్షన్‌ప్లాన్‌పై మండల స్థాయి కన్వర్జెషన్ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. రైతులను సేంద్రియ సాగు వైపు మళ్లించేందుకు చేపట్టవలసిన చర్యలపై వ్యవసాయ శాఖ సిబ్బందికి అవగాహన కల్పించారు.

దాడి ఘటనపై కేసు నమోదు

జి.కొండూరు: పాతకక్షల నేపథ్యంలో జరిగిన దాడిలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. జి. కొండూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. జి.కొండూరు మండల పరిధి కోడూరు గ్రామానికి చెందిన బక్కతట్ల అమేష్ స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం సెంటర్‌లో కిరాణా దుకాణం నిర్వహిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన మాగంటి జమలయ్య బుధవారం ఉదయం 8 గంటల సమయంలో అమేష్ కిరాణా దుకాణంలో విక్రయించే పెట్రోలును కొనేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో పాత కక్షల నేపథ్యంలో ఇద్దరి మధ్య వివాదం తలెత్తి అమేష్ తలపై జమలయ్య కర్రతో దాడిచేశాడు. తీవ్రంగా గాయపడిన అమేష్‌ను మైలవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఉపాధి కూలీల వేతన బకాయిలు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పి.రామకృష్ణ

నూజివీడు: ఉపాధి హామీ పథకం కూలీలకు వేతనాలను చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వం పండుగ రోజు కూడా వారిని పస్తులు పెడుతోందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ ధ్వజమెత్తారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం నూజివీడులోని సుందరయ్య భవనంలో మేడిపల్లి హోలీ మేరీ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జనవరి 15 నుంచి నేటికీ వేతనాలు విడుదల చేయకపోవడంతో కూలీల కుటుంబాలు అప్పుల పాలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కూలీలకు 15 రోజులకోసారి వేతనాలు ఇవ్వాలని చట్టంలో ఉన్నప్పటికీ దానిని అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ధ్వజమెత్తారు. కూలీలకు పని ప్రదేశాల్లో పనిముట్లు, మంచినీరు, మజ్జిగ, టెంట్ వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. కూటమి ప్రభుత్వంలో ఉపాధి పనుల్లో కూడా రాజకీయ నాయకులు జోక్యం చేసుకోవడం దుర్మార్గమని విమర్శించారు. సంఘం జిల్లా నాయకులు పి.లక్ష్మయ్య, సత్తు కోటేశ్వరరావు, అనిల్, అర్జున్‌రావు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మిక సంఘం నేతల పర్యటన

తిరువూరు: గత 12 వారాలుగా తమకు ఉపాధి హామీ పథకం వేతనాలు అందలేదని ఎ.కొండూరు మండలంలోని జాబ్‌కార్డుదారులు వ్యవసాయ కార్మిక సంఘ నాయకుల ఎదుట వాపోయారు. బుధవారం సంఘ నాయకులు ఎ.కొండూరు మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో పనిచేసే కార్మికుల సమస్యలు తెలుసుకున్నారు. రోజుకు రూ.200 వేతనం కూడా గిట్టుబాటు కావడం లేదని, వ్యవసాయ పనులు లేక తప్పని పరిస్థితుల్లో ఉపాధి పనులకు రావలసి వస్తోందని వాపోయారు. పనిచేసే ప్రదేశంలో కనీసం నీడ సౌకర్యం కూడా లేదని, కనీస వేతనాలు పెంచాలని కోరారు. ఎ.కొండూరు మండలంలో ఉపాధి కూలీలకు రూ.కోటీ 50 లక్షల వేతనాలను ప్రభుత్వం చెల్లించాల్సి ఉందని వ్యవసాయ కార్మిక సంఘ నాయకుడు పానెం ఆనందరావు తెలిపారు.

సారా నిందితుల బైండోవర్

ముసునూరు: సారా విక్రయాలు నిర్వహించిన పాత కేసుల్లో నిందితులు నలుగురిని బుధవారం తహసీల్దార్ కె.రాజ్‌కుమార్ ఎదుట బైండోవర్ చేశామని నూజివీడు ఎక్సైజ్ సీఐ ఎ.మస్తానయ్య తెలిపారు. చెక్కపల్లికి చెందిన తాళం మోహనరావు, గుర్రం వెంకటేశ్వరరావు, పిల్లి సతీష్‌బాబు, ఆంజనేయులును బైండోవర్ చేయగా వారిని నేరాలకు పాల్పడొద్దని, మరలా నేరాలు చేస్తే ప్రభుత్వం నుంచి అందే సౌకర్యాలు రద్దవుతాయని, లక్ష రూపాయల జరిమానా విధిస్తామని తహసీల్దార్ హెచ్చరించారు.

వాగు స్థలం ఆక్రమణ

మైలవరం: మైలవరం పట్టణం పొందుగల రోడ్డులోని వాగు పోరంబోకు స్థలాన్ని ఓ వ్యక్తి ఆక్రమించి స్తంభాలు పాతి చుట్టూ ఫెన్సింగ్ వేశాడు. ఇటీవల కొద్ది రోజుల కిందట అదే వాగు జాలును ఆక్రమించేందుకు ప్రయత్నించగా మైలవరం రెవెన్యూ, పంచాయతీ అధికారులు స్థలాన్ని పరిశీలించి ఆక్రమణకు పాల్పడిన వ్యక్తులకు నోటీసులు జారీ చేశారు. దీనితో కొద్ది రోజులు నిలిచిపోయింది. తిరిగి మరోసారి ఆక్రమణకు స్థలం గురైంది. దీనిపై పంచాయతీ కార్యదర్శి రఫీని వివరణ కోరగా విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

ఉర్దూ ఉపాధ్యాయుడిని నియమించాలని వినతి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఉర్దూ స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుడిని నియమించాలని ముస్లిం మైనార్టీ నాయకులు హబీబుల్లా, లాయర్ రెహ్మాన్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పాఠశాల హెచ్‌ఎం శేషగిరిరావుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. మీ ద్వారా జిల్లా విద్యా శాఖాధికారులకు విషయం తెలియజేయాలని వారు కోరారు. వారు మాట్లాడుతూ ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ఉర్దూ మొదటి భాషగా చదివిన ముస్లిం మైనార్టీ విద్యార్థులు హైస్కూల్ స్థాయిలో ఉర్దూ ఉపాధ్యాయుడు లేకపోవడంతో ఉర్దూ భాషకు దూరం అవుతున్నారని చెప్పారు. కొంతమంది డ్రాపవుట్లుగా మారుతున్నారన్నారు. సచార్ కమిటీ సర్వేలో మైనార్టీ విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నట్లు తేలిందన్నారు.

ఎండీయూ వాహనం, రేషన్ బియ్యం సీజ్

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి రేషన్ బియ్యం పంపిణీ వాహనంలో 23 బస్తాల ప్రభుత్వ రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. కొండపల్లి 10వ నంబర్ ఎండీయూ వాహన నిర్వాహకుడు గౌస్ బుధవారం బియ్యం పంపిణీ చేస్తుండగా విజిలెన్స్ సీఐ ఉమర్ తనిఖీ చేశారు. తనిఖీలో సుమారు 1,150 కిలోలు (23 బస్తాలు) తేడా ఉన్నట్లు గుర్తించారు. లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేయకుండా నామమాత్రపు నగదు చెల్లించి వాహనంలో నిల్వ చేసినట్లు గుర్తించారు. పట్టుబడిన బియ్యం, వాహనాన్ని సీజ్ చేసి సివిల్ సప్లయీస్ డెప్యూటీ తహసీల్దార్ రామకృష్ణకు అప్పగించారు. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రెండు ఇసుక టిప్పర్లు స్వాధీనం

విస్సన్నపేట: అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తున్న రెండు టిప్పర్లను విస్సన్నపేట పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. ఇసుక తరలింపునకు సంబంధిత అధికారుల నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాల్సి ఉందని, నిబంధనలు ఉల్లంఘించి ఇసుక రవాణా చేస్తున్న టిప్పర్లపై వాల్టా చట్టం కింద కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

వైఎస్సార్ సీపీని బలోపేతం చేయాలి

మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



రాంబాబును సత్కరిస్తున్న ప్రతాప్ అప్పారావు, నాయకులు

నూజివీడు: వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రతి ఒక్కరూ కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేయాలని మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పిలుపునిచ్చారు. ముసునూరు మండలం కాట్రేనిపాడుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు కంబాల రాంబాబు వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా నియమితులయ్యారు. రాంబాబును ప్రతాప్ అప్పారావు బుధవారం ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు సంక్షేమాన్ని అమలు చేయాలన్నా, రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలన్నా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమన్నారు. ప్రభుత్వ రంగంలో మెడికల్ కళాశాలల ఏర్పాటు, పోర్టుల నిర్మాణం వంటివి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చేపట్టారన్నారు. కూటమి ప్రభుత్వం పాలన చేపట్టి తొమ్మిది నెలలు గడుస్తున్నా ఇంత వరకు సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా కల్లబొల్లి మాటలు చెబుతోందని ధ్వజమెత్తారు. ప్రజలు అన్నీ గమనిస్తూనే ఉన్నారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కొడవటి రాంబాబు, వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధికార ప్రతినిధి కంచర్ల లవకుమార్, పట్టణ అధ్యక్షుడు శీలం రాము, సీనియర్ నాయకులు కలపాల కృపారావు, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు ప్రత్తిపాటి జోజి, నాయకులు కోపూరి సుధాకర్, కంభాల ప్రదీప్, దొండపాటి కిషోర్, దువ్వూరి కుమార్, కఠారపు జోజి పాల్గొన్నారు.

విద్యతోనే సమాజంలో గుర్తింపు

గిరిజన సంక్షేమ శాఖాధికారి ఉమామహేశ్వరరావు



విద్యార్థులతో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

మైలవరం: మనిషి ఎదుగుదలకు విద్యే మూలాధారమని, విద్యతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఎన్టీఆర్ జిల్లా డెప్యూటీ కలెక్టర్, జిల్లా సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) ప్రాజెక్టు కో–ఆర్డినేటర్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఎం. ఉమామహేశ్వరరావు అన్నారు. మైలవరంలోని శ్రీ లీలావతి గిరిజన పాఠశాలను వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం ఆయన సందర్శించారు. పాఠశాలలోని ఒకటి నుంచి 7వ తరగతి వరకు విద్యార్థుల విద్యాస్థాయిని వేర్వేరుగా పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల కృషిని అభినందించారు. పాఠశాల రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఎంఈఓలు పీవీ నరసింహారావు, ఎల్.బాలు, ఎస్ఎస్ఏ సిబ్బంది, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉడతా లక్ష్మీనారాయణ, కార్యదర్శి జంజనం రాధాకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గొల్లపూడిలో రబీ ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లాలో 107 రబీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు. సాధారణ రకం ధాన్యానికి 100 కిలోలకు రూ.2,320లు, 75 కిలోలకు రూ.1,740లు, గ్రేడ్ ఎ రకం ధాన్యానికి 100 కిలోలకు రూ.2,320లు, 75 కిలోలకు రూ.1740లు కనీస ధరగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. తూకం, తేమ శాతం విషయంలో ఎటువంటి తేడాలు లేకుండా నిబద్ధతతో కొనుగోలు చేస్తున్నామని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల వ్యవధిలోనే రైతులకు సొమ్ము చెల్లిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు ఏపీలో రూ.8 వేల కోట్లకు పైగా విలువైన సుమారు 34,78,445 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని తెలిపారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

తిరువూరు: చిన్ననాటి నుంచే పిల్లలకు పుస్తక పఠనంపై ఆసక్తి కల్పించాలని గంపలగూడెం ఎంఈఓ నరసింహారావు తల్లిదండ్రులకు సూచించారు. గంపలగూడెం మండలం పెనుగొలను గ్రంథాలయంలో బుధవారం అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవం సందర్భంగా పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంఈఓ మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు సెల్‌ఫోన్లకు అలవాటు కాకుండా ప్రతి రోజూ వారిని గ్రంథాలయానికి పంపాలని తల్లిదండ్రులను కోరారు. సెల్‌ఫోన్ గేమ్స్ వల్ల పిల్లల్లో ఉద్రేకం, అసహనం, మానసిక సమస్యలు తలెత్తుతున్నాయని, మొబైల్‌కు బానిసలు కాకుండా వారిని పుస్తక పఠనం వైపు మళ్లిస్తేనే మంచి పౌరులుగా ఎదుగుతారని వివరించారు. గ్రంథాలయాధికారి శ్రీలత, ఉపాధ్యాయులు రంగమ్మ, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలన ప్రభుత్వాల బాధ్యత

సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నేత హరినాథ్

నూజివీడు: రాష్ట్రంలో పేదరికాన్ని తొలగించి వారి జీవన ఆర్థిక పరిస్థితులు మెరుగుపరచాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి.హరినాథ్ అన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ధనవంతులు పేదలకు సహాయం చేయండని పీ ఫోర్ పేరుతో ప్రజలను ముఖ్యమంత్రి చంద్రబాబు ఏప్రిల్ ఫూల్ చేశారని విమర్శించారు. అభివృద్ధి, సంక్షేమం పేరుతో అధికారాన్ని చేపట్టిన చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చకపోవడం వలన ప్రజల్లో వచ్చే నిరసనను, వ్యతిరేకతను పక్కదారి పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. అన్నార్తుల ఆక్రందనలు నివారించాలంటే ప్రతి రాజకీయ నాయకుడు తాను సంపాదించిన అక్రమ సంపాదనలో కేవలం ఐదు శాతం ప్రభుత్వ పరం చేసినా పేదలకు లబ్ధి చేకూరుతుందని, పేదరికం కొంతైనా నిర్మూలన అవుతుందని చెప్పారు. ప్రభుత్వం తన బాధ్యతను విస్మరించి సంపన్నులను బాధ్యత తీసుకోమని చెప్పడం ఆచరణలో సాధ్యం కాదన్నారు.

వరి కోతలు వాయిదా వేసుకుంటే మేలు

తిరువూరురూరల్: ఈ నెలలో కొద్దిరోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు రబీ వరి కోతలను వాయిదా వేసుకోవాలని తిరువూరు మండల వ్యవసాయాధికారి పద్మ పేర్కొన్నారు. రానున్న వారం పది రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచించిందని చెప్పారు. వారి సూచనల మేరకు రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే వరి కోతలు ప్రారంభించిన రైతులు వాటిని పట్టాలతో కప్పి భద్రపరుచుకోవాలని చెప్పారు. కోతలు పూర్తయితే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని సూచించారు. రైతులు తమకు కావలసిన గోనె సంచులను ఎన్ని కావాలో వారం రోజులు ముందుగా టెక్నికల్ అసిస్టెంట్లకు తెలియజేయాలన్నారు. తేమ శాతం పరిశీలించిన తర్వాత జీపీఎస్ వాహనాల ద్వారా మాత్రమే రైతుల నుంచి ధాన్యం మిల్లులకు తరలిస్తారని చెప్పారు. ఏ గ్రేడ్ రకం ధాన్యానికి కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.2,320, కామన్ రకం రూ.2,300 గా ప్రభుత్వం నిర్ణయించిందని వివరించారు. రైతులు ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని చెప్పారు.

నేడు, రేపు కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

తిరువూరు: మండలంలో బీసీ, ఈబీసీ, కమ్మ, కాపు, వైశ్య కార్పొరేషన్ల ద్వారా రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 3, 4 తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తిరువూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి రవిబాబు తెలిపారు. 3న ముష్టికుంట్ల, వామకుంట్ల, కొమ్మిరెడ్డిపల్లి, మునుకుళ్ల, వావిలాల, ఎర్రమాడు, పెద్దవరం, ఎరుకోపాడు, చింతలపాడు, మల్లేల గ్రామాలకు చెందిన అభ్యర్థులకు, 4న లక్ష్మీపురం, రోలుపడి, ఆంజనేయపురం, అక్కపాలెం, కోకిలంపాడు, చిట్టేల, కాకర్ల, గానుగపాడు, జీకొత్తూరు, చౌటపల్లి గ్రామాల అభ్యర్థులకు ఇంటర్వ్యూలు జరుగుతాయని చెప్పారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ ఆధార్, పాన్, రేషన్ కార్డులు, బ్యాంకు ఖాతా పుస్తకం, కుల ధ్రువీకరణపత్రం, పాస్‌పోర్టు ఫొటోతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు.